క్లుప్తంగా

రికవరీ చేసిన ఫోన్ల అందజేత



బాన్సువాడ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బుధవారం బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి 1 నుంచి నేటి వరకు బాన్సువాడలో వివిధ చోట్ల ఫోన్లు పోగొట్టుకున్న 354 మంది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 108 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామని అన్నారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్ల విలువ రూ.12 లక్షల వరకు ఉంటుందని అన్నారు. మొబైల్ పోయిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఏఎస్సై రాములు, హోంగార్డు రాజశేఖర్‌లను అభినందించారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: వెల్లుట్లకు చెందిన చాకలి సాయిలు గత నెల 17న సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి బుధవారం అందించినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు.

ఆర్థిక సాయం



భిక్కనూరు: విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఆపరేటర్ కుటుంబానికి భిక్కనూరు విద్యుత్ సిబ్బంది బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన దుదుపుల నాగరాజు తాడ్వాయి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తూ ఈనెల 8న విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. భిక్కనూరు విద్యుత్ ఉద్యోగులు నాగరాజు కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రాన్స్‌కో ఏడీఈ ప్రభాకర్, ఏఈలు లక్ష్మీ నర్సింలు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి..



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ రామగిరి కుటుంబానికి మండల ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. రామగిరి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలను అందించారు. మండల ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బత్తుల భిక్షపతి, అధ్యక్షుడు ఉప్పరి లింబాద్రి, ప్రధాన కార్యదర్శి బూర్ల శ్రావణ్ కుమార్, కోశాధికారి ఎండీ సమీర్, సలహాదారులు రాజేందర్, రాజు కుమార్, నవీన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఆశావర్కర్లు



ఎల్లారెడ్డి: మండలంలోని ఆశావర్కర్లు బుధవారం విధుల్లో చేరారు. కొద్ది రోజులుగా ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె నిర్వహించారు. బుధవారం తాత్కాలికంగా సమ్మెను విరమించి విధుల్లో చేరుతున్నట్లు మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శరత్‌కు తెలిపారు.

సమ్మక్క-సారక్క పేరు పెట్టడం హర్షణీయం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): వరంగల్ జిల్లాలోని సమ్మక్క-సారక్క దేవాలయాన్ని బుధవారం బీజేపీ నాయకులు సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన విశ్వ విద్యాలయాన్ని మంజూర్ చేయడమే కాకుండా ఆ విశ్వవిద్యాలయానికి సమ్మక్క-సారక్క గిరిజన విశ్వవిద్యాలయం అని నామకరణం చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఆ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ములుగు జిల్లాలోని రామప్పదేవాలయాన్ని సందర్శించారు. బీజేపీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి, తాడ్వాయి నాయకులు వెంకట్‌రావు, రవీందర్‌రావు, లింగారావు, హోటల్ శ్రీనివాస్, తిరుపతిరెడ్డి ఉన్నారు.

కోతుల బెడద



తుక్కోజీవాడిలో ఇంటి పెంకులను తీసేసి సిమెంట్ చేసుకున్న దృశ్యం

- ఆందోళన చెందుతున్న ప్రజలు
- నేరుగా ఇళ్లలోకి చొరబడుతున్న వానర మూకలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రమైంది. ఎక్కడ పడితే అక్కడ వానర దండే కనిపిస్తోంది. గ్రామాల్లో ఏ దారిన వెళ్లాలన్నా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గాయాల పాలైన వారు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. చేతుల్లో ఏదైనా కవర్ కనిపిస్తే చాలు వెంటపడి లాక్కెళ్తున్నాయి. నేరుగా ఇంటి తలుపులను తీసి ఇళ్లలోని తినుబండారాలను తీసుకెళ్తూ వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. వానర సైన్యం బాధ భరించలేక ప్రజలు సతమతమవుతున్నారు. వాటిని బెదిరింపులకు గురి చేస్తే మీద పడి దాడి చేసి గాయపరుస్తున్నాయి.

ఇంటి పెంకులను పీకేస్తున్నాయ్

ఇంటి పై కప్పులు సైతం వదలడం లేదు. ఇళ్లపై దుముకుతూ పెంకులను పగులగొడుతు నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. కోతుల బెడద నుంచి తప్పించుకోవడానికి ప్రజలు వేరే మార్గం లేకుండా పోయింది. చాలా గ్రామాల్లో పై కప్పులపై ఉన్న పెంకులు తొలగించి పెంకులకు బదులు పూర్తిగా సిమెంట్ చేయించుకుంటున్నారు. దీంతో కొంత బాధ తప్పిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో కోతుల బెడదను తీర్చడానికి ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో కోతులు పట్టడానికి ప్రత్యేకంగా మనుషులను తెప్పించి రూ.లక్షలు ఖర్చు చేశారు. అయినా కోతుల బెడద తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది

ఒంటరిగా మనుషులు బయట తిరగాలంటే భయపడుతున్నారు. కనిపిస్తే చాలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. మనుషులు ఉండగా కూడా నేరుగా ఇళ్లలోకి చొరబడి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. ఇంటి పై కప్పులను ధ్వంసం చేస్తుండడం వల్ల వర్షాలకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితిని చవిచూడాల్సి వచ్చింది. అధికారులు దృష్టి సారించాలి.

–రమేశ్, తుక్కోజీవాడి

'పని చేయడం చేతకాకపోతే మానుకోండి'



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ పాల్త్య విఠల్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): పని చేయడం చేతకాకపోతే మానుకోండి అని ఎంపీపీవో కార్యాలయ సిబ్బందిపై ఎంపీపీ పాల్త్య విఠల్ బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఫీసులో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని మరొకసారి ఇలా జరిగితే ఉపేక్షించబోయేది లేదన్నారు. నూతన భవనం చుట్టూ నాటించాల్సిన మొక్కలు వారు రోజులు పూర్తవుతున్నా నాటడంతో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం చేయడంతో మండిపడ్డారు. ఉదయం 10.30 గంటలవుతున్నా ఆఫీసుకు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ ఫోన్ చేసి ఏపీవో సౌజన్యపై ఆగ్రహించారు.

ముగిసిన మెడికల్ కోడింగ్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న లైఫ్ సైన్స్ విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: మెడికల్‌లో విద్యార్థులకు బేసిక్స్ నుంచి కోడింగ్ వరకు విలువైన సమాచారంతో శిక్షణ పొందడం కామారెడ్డి విద్యార్థుల అదృష్టంగా భావించాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య అన్నారు. కళాశాల టీఎస్‌కేసీ, టాస్క్ ఆధ్వర్యంలో డిగ్రీ లైఫ్ సైన్స్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు మూడు రోజుల మెడికల్ కోడింగ్ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడారు. కార్పొరేట్ ఉద్యోగాలు సులభంగా పొందడానికి మెడికల్ కోడింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ నిఖిల్, మణికంఠ, కార్తీక్, సమన్వయకర్త ఫర్హీన్ ఫాతిమా, మెంటర్ అజారొద్దీన్, అధ్యాపకులు సుచరణ్, అఫ్రీన్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న నోడల్ అధికారి షేక్ సలాం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. ఆయన బుధవారం తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో అన్నిరకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో పదేళ్లు పనిచేసి సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లిన కామర్స్ అధ్యాపకులు శ్రీనివాస్‌ను సన్మానించారు. ప్రిన్సిపాల్ యూసుఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



కామారెడ్డిలోని బాలికల పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు



భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలలో..

కామారెడ్డి టౌన్: బాల్య వివాహాలను అరికట్టాలని కామారెడ్డి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్బీ రమేష్ చంద్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మోహన్ రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పల్లె చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిగా నివారించాలి

భిక్కనూరు: బాల్య వివాహాల నివారణ అందరూ బాధ్యతగా స్వీకరించి వాటిని పూర్తిగా నివారించాలని పారా లీగల్ వాలంటీర్లు సంతోష్, నరేష్‌లు అన్నారు. బుధవారం జంగంపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలతో పాటు భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలలో బాల్యవివాహల నివారణపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు ఇబ్బందుల గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మణిదీప్తీ హెచ్‌ఎం రాజగంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో ఫిజియోథెరపి నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు ఫిజియోథెరపి చికిత్స

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు బుదవారం ఫిజియోథెరపి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కమల్ కిషోర్ మాట్లాడుతూ.. తెలంగాణ సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి, 9 మంది దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి రోజూ ఇంటి వద్ద పిల్లలకు వ్యాయామం చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు గంగాధర్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ అరుణ్, వైద్య పరీక్షలు చేశారు. భవిత సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.

అక్రమంగా రిలీవ్ అయిన టీచర్లను వెనక్కి పిలిపించాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ అయిన ఉపాధ్యాయులను వెనక్కి పిలిపించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.సత్యనారాయణ, సీహెచ్.అనిల్‌కుమార్‌లు బుధవారం డిమాండ్ చేశారు. ఇటీవల బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు సబ్‌స్టిట్యూట్ రాకుండా రిలీవ్ చేయవద్దని నిబంధనలు ఉన్నా జిల్లాలో కొన్ని పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేశారన్నారు. చాలామందిని పైరవీలతో రిలీవ్ చేశారని తక్షణమే వారిని వెనక్కి పిలిపించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి



బాన్సువాడ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ కోరారు. బుధవారం పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తే రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేయనున్నట్లు తెలిపారు. నాయకులు ఖలేక్, అసద్ బిన్ మోసిన్, హన్మండ్లు, మంత్రి గణేష్, మధుసూదన్ రెడ్డి, కాసుల రోహిత్, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎల్లారెడ్డి విద్యార్థుల ఎంపిక



ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట జెడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజులు తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు వనపర్తి జిల్లాలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు. అండర్–17 విభాగంలో పాఠశాలకు చెందిన సవిత, సౌమ్య, మహేందర్‌లు ఎంపికైనట్లు వెల్లడించారు. వారిని ఉపాధ్యాయులు వెంకటరమణ, అతీకుల్లా అభినందించారు.

రజక సంఘం నూతన కార్యవర్గం



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి గ్రామ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఐలమ్మ భవనంలో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అధ్యక్షుడిగా సంగ్యపు పొల్కంపేట సాయిలు, ప్రధాన కార్యదర్శిగా సంగెపు ధర్మయ్య, ఉపాధ్యక్షుడిగా బిక్కండ్ల రాజయ్య, కోశాధికారిగా బండల్ల మల్లేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుల పెద్దలు రమేశ్, కిష్టయ్య, సాయిలు, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



లింగంపేట(ఎల్లారెడ్డి): ఎన్నికల కోడ్ అమలులోని రావడంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం మెంగారం శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. పలువురికి జరిమానాలు విధించారు. ఎస్సై ప్రభాకర్, ఏఎస్సై, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో బతుకమ్మ వేడుకలు

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు పువ్వులతో బతుకమ్మ తయారు చేసి ఆనందోత్సాహాలతో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ముందు తరాలకు తెలిపే విధంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు. బతుకమ్మ విశిష్టత గురించి విద్యార్థులకు తెలియజేశారు.

రికార్డు మెజార్టీని కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



కాచాపూర్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

భిక్కనూరు: సీమాంధ్రులతో 14 ఏళ్ల పాటు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్‌కు కామారెడ్డి నుంచి రికార్డు మెజార్టీ అందించి, ఆయనకు బహుమతిగా ఇవ్వాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బుధవారం కాచాపూర్‌లో బూత్ కమిటీ సమావేశంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద ఓటర్లకు ఒక కార్యకర్తను నియమించనున్నట్లు, ఆ కార్యకర్త ప్రతి రోజూ తనకు కేటాయించిన వంద ఓటర్లను కలువడంతో పాటు కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించడంతో పాటు జరిగిన అభివృద్ధి గురించి వివరించాలన్నారు. అలాగే బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టో గురించి వివరించాలన్నారు. ఎంపీపీ గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు కిష్టాగౌడ్, సిద్ధరాములు, మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, విండో చైర్మన్లు గంగళ్ల భూమయ్య, రాజగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలాభివృద్ధి

మాచారెడ్డి: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బుధవారం ఎల్లంపేటలో బీఆర్‌ఎస్ బూత్ కమిటీ అధ్యక్షులను ఏర్పాటు చేసిన అనంతరం మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి కేసీఆర్‌ను రికార్డ్ స్థాయి మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ మినుకూరి రామ్ రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్ చంద్రం, తదితరులున్నారు.

సీఎం కేసీఆర్‌ను ఓడించి తీరుతాం

- తిప్పాపూర్‌లో ముదిరాజు కులస్తుల తీర్మానం



నినాదాలు చేస్తున్న ముదిరాజులు

భిక్కనూరు: మా కుల దేవత పెద్దమ్మ తల్లి మీద ఒట్టేసి చెబుతున్నాం.. కేసీఆర్‌ను ఓడిస్తాం... ఆయనపై ఊరికి నలుగురు చొప్పున ముదిరాజులను పోటీకి నిలబెడతామని భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో ముదిరాజు కులస్తులు తీర్మానం చేశారు. బుధవారం ముదిరాజు యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలం నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక పెద్దమ్మ దేవాలయం వద్ద సమావేశమయ్యారు. అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో ముదిరాజులకు బీఆర్‌ఎస్ తీవ్ర అన్యాయం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజులకు ఒక్క ఎమ్మెల్యే టిక్కెట్టు కూడా ఇవ్వకుండా నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పడం మోచేతికి బెల్లం పెట్టడం అవుతుందన్నారు. ముదిరాజులకు సీట్లు ఇచ్చే పార్టీలనే ఆదరిస్తామని, ఆ పార్టీలకే మద్దతు ఇస్తామన్నారు. ముదిరాజు సంఘం ప్రతినిధులు కొండ సాయిలు, బోయిని సాయిలు, కొండ సంతోష్, కొండ సిద్దరాములు, బీమరి రఘుపతి, కొండ మాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తాం



సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు

–బీఎంఎస్ ఆటో యూనియన్

కామారెడ్డి అర్బన్: తమ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్‌కు మళ్లీ వినతి పత్రాలు అందిస్తామని పరిష్కారం కాకుంటే వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని బీఎంఎస్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.నర్సింలు అన్నారు. బుధవారం స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంలో బీఎంఎస్ ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఆటో కార్మికుల సమస్యలను బీఆర్‌ఎస్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఆటో యూనియన్ నాయకులు ఎ.కృష్ణ, ఎం.రవి, ఎం.సిద్దిరాములు, ఎన్.బీరప్ప, సాయిలు, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల గురించి వివరించాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత మధుసూదన్

దోమకొండ: సీఎం కేసీఆర్‌ను కామారెడ్డి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ కోరారు. బుధవారం సంఘమేశ్వర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి బూత్ స్థాయి నుంచి ఓటర్ల వివరాలు సేకరించి వారితో మాట్లాడాలని, ప్రభుత్వ పథకాలు వారికి వివరించాలని సూచించారు. సంఘమేశ్వర్‌తో పాటు అంబారీపేట, గొట్టిముక్కల గ్రామాల్లో పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్ రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు మధుసూదన్, బొమ్మెర శ్రీనివాస్, తదితరులున్నారు.

హుండీ లెక్కింపు



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీలను బుధవారం నిజామాబాద్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ సమక్షంలో లెక్కించారు. రూ.3,94,340 వచ్చినట్టు ఈవో శ్రీధర్ తెలిపారు. మూడు నెలలకు సంబంధించి హుండీ లెక్కించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, సభ్యులు రాజయ్య, శ్రీధర్‌రావ్, లక్ష్మీనర్సింలు, అర్చకులు ఉన్నారు.

సమాచారం..

13 నుంచి జోనల్ స్పోర్ట్స్ మీట్

బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఈ నెల 13 నుంచి 16 వరకు జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పద్మ కుమారి తెలిపారు. 9వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌కు 3వ జోన్‌లోని 2 జిల్లాలకు చెందిన సుమారు 1,275 మంది విద్యార్థినులు హాజరవుతారన్నారు. అండర్–14, 17, 19 విభాగాల్లో గేమ్స్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను ఈనెల 13న కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఉమ్మడి జిల్లాల ఆర్‌సీవో అలివేలుతో కలిసి ప్రారంభిస్తారన్నారు.

నేడు కామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన కామారెడ్డి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.